# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

## వార్త

శనివారం 28 జూన్ 2025




కాశీనాయన జ్యోతి క్షేత్రానికి ఆగిన ఆర్టీసీ బస్సు సర్వీసులు అటవీశాఖ అధికారుల ఆదేశాలతో బస్సులు నిలిపివేశామన్న ఆర్టీసీ. గతంలో జ్యోతిక్షేత్రం దగ్గర అధికారులు కూల్చిన అన్నదాన సత్రాలను సొంత డబ్బుతో పునఃనిర్మించిన మంత్రి నారా లోకేష్. అనంతరం బస్సులను ప్రారంభించిన ఏపీ ప్రభుత్వం.

## చెట్లను పెంచుట మనందరి బాధ్యత

**రాజుపాళెం, జూన్ 27, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పర్ల పాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయులు హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఏపీఓ వసంతకుమార్ ఉపాధి హామీలతో మొక్కలను నాటించారు. పాఠశాలతో పాటు పశువైద్యశాలలో కూడ పశువైద్యాధికారి శివ జ్యోతి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ మొక్కలను రాజా గ్రీన్ ట్రస్ట్ వారి ద్వారా ఇచ్చిన మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈసీ కరుణ, ఉపాధ్యాయుడు ప్రసాద్, టీఏ వేణుగోపాల్ రెడ్డి, వీర వెంకటేశ్వర రెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

### ఎట్టకేలకు కడప - రేణిగుంట హైవేకు

# తొలగిన అడ్డంకులు..!

- ఆకృతుల మార్పుతో అటవీశాఖ నుండి అనుమతులు
- అనుమతులకు కేంద్ర ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం
- అడ్డంకులు తొలగడంతో నిర్మాణం పనులు చేపట్టే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం



**(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**

ఎట్టకేలకు కడప - రేణిగుంట హైవేలో నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి అడ్డంకులు తొలిగాయి. అటవీ శాఖ ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో కొన్ని ఆకృతులు మార్పు చేస్తూ అనుమతులు ఇచ్చింది. దీంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి కొన్నేళ్లుగా ఉన్న అడ్డంకులు తొలగినట్లయ్యింది. ఈ అనుమతులు లభ్యతకు కేంద్ర ప్రభుత్వం నుండి సంపూర్ణంగా సహకారం లభించినట్టు తెలుస్తోంది. కడప - రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అడ్డంకులు తొలగి అనుమతులు లభించడంతో త్వరితగతిన పనులు చేపట్టే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తయ్యితే ఈ హైవేకు చారిత్రాత్మక ప్రాశస్త్యము కూడా ఏర్పడనుంది. ఎందుకంటే కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని తొలి గడపగా పురాణ ఇతిహాసమున్న కడప నుండి తిరుపతి సమీపంలోని రేణిగుంట వరకు నాలుగు వరుసల హైవే నిర్మాణం ఏర్పడినట్లవుతుంది. తద్వారా అన్నమయ్య, కడప జిల్లాల ప్రజలు, ప్రయాణీకులు, భక్తులే కాకుండా సుదూరం నుండి తిరుమలకు చేరుకునే భక్తులకు ఎంతో సౌకర్యం ఏర్పడుతుంది. ఎందుకంటే ప్రస్తుతం ఈ హైవే అనేకచోట్ల బాగా దెబ్బతిని ఉండడంతో ప్రయాణీకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి గతంలోనే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి ఉంది. అయితే అటవీ శాఖ నుండి అనుమతులు లేకపోవడంతో టెండర్లు ఖరారై కూడా స్థానికంగా ప్రజాప్రతినిధులు సరైన చొరవ చూపకపోవడంతో నిరా ్మణానికి నోచేకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రత్యేక శ్రద్ధ చూపడంతో కేంద్ర ప్రభుత్వం సహకారంతో అటవీ శాఖ నుండి దశ (స్టేజ్) అనుమతులు వచ్చేలా కృషి చేసింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపై రాష్ట్ర రోడ్డు భవనాల శాఖా మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి అనుమతుల విషయంలో వన్యప్రాణుల జాతీయ సంస్థ కమిటీ అధికారుల బృందాన్ని ఒప్పించడంతో అనుమతులకు గ్రీన్ సిగ్నల్ లభించిందన్నారు. వేంకటేశ్వరుని పాద పద్మాల చెంత నున్న తిరునగరికి శ్రీనివాసుని తొలి గడప కడప నుండి నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి అనుమతులు లభ్యతతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రేణిగుంట - కడప మధ్య 130 కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం నిర్మించాల్సి ఉంది. ఈ హైవే తిరుపతి జిల్లాలో 20 కిలోమీటర్లు, అన్నమయ్య, కడప జిల్లాల్లో 110 కిలోమీటర్ల నిడివి ఉంటుంది. దాదాపు రూ.2500 కోట్ల అంచనాతో నిర్మించేలా రెండేళ్ల క్రిందటే గుత్తేదారుతో ఒప్పందం కూడా కుదిరినట్టు సమాచారం. అయినా అడుగు ముందుకు పడలేదు. తాజాగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుండి అనుమతులు లభించాయి. ఈ మేరకు కేంద్ర మంత్రి గడ్కరీ కార్యాలయం నుండి సమాచారం విడుదలైంది. దీంతో కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి మార్గం సుగమమైంది.

- గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించిన వన్యప్రాణుల సంరక్షణ జాతీయ బోర్డు అధికారులు కడప - రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదిత ప్రాంతాన్ని అటవీ శాఖాధికారులు ఇటీవల పరిశీలన జరిపారు. ఈ రహదారి నిర్మాణంలో ఏర్పడిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. ఈ హైవేలో 31 కిలోమీటర్ల పొడవునా వన్యప్రాణుల సంచారం అధికంగా ఉందంటూ అటవీశాఖ అనుమతులు ఇవ్వడానికి ప్రారంభంలో అభ్యంతరాలు తెలిపింది. చివరికి బెంగుళూరులోని వన్యప్రాణుల సంరక్షణ జాతీయ బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడవి జంతువుల రాకపోకలకు అనువుగా భూగర్భ మార్గాలు నిర్మించాలంటూ రహదారి నిర్మాణ ఆకృతుల్లో కొన్ని మార్పులు సూచించారు. అందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ ఏ ఐ) సమ్మతించడంతో అటవీ శాఖ పచ్చ జండా ఊపింది.

## ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి

**దువ్వూరు, జూన్ 27, ప్రభాతవార్త:**



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరం అయిన రసాయనిక ఎరువులు, విత్తనాల కొరత లేకుండా వ్యవసాయ శాఖ చూడాలని మండల సమావేశంలో సభ్యులు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్‌లో శుక్రవారం దువ్వూరు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా సమావేశంలో వివిధ సమస్యలపైన చర్చించారు. మండలంలోని మంచినీటి సమస్య, ఉపాధి హామీ అలాగే వ్యవసాయ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. వైద్య ఆరోగ్య శాఖలో పలు అంశాలపై అధికారులు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలకు ప్రోత్సాహకం వస్తున్నదని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారి అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులు రాయితీ పైన ఇప్పటికే 5గ్రామాల్లో 250క్వింటాళ్ల జీలుగలు పంపిణీ చేశామని, రెండు మూడు రోజుల్లో ఇంకా 250క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని వాటిని మిగతా గ్రామాల్లో పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వం రాయితీ విత్తనాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న జీలుగ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో జనుము, పిల్ల పెసర వంటి విత్తనాలు అందజేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద 7218 మంది ఎంపిక అయ్యారని వారికి ప్రభుత్వం త్వరలో నిధులు ఇస్తుందన్నారు. కొంతమంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదని జాబితాలో ఉన్న వారు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం దువ్వూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందున 2017 మందికి కోటి 85లక్షలు పరిహారం మంజూరు అవుతుందని వాటిని త్వరలో వారి ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఐసీడీఎస్ తరపున సీడీపీఓ ముంతాజ్ బేగం అంగన్ వాడి కేంద్రాలలో అందిస్తున్న సేవలను గురించి వివరించారు. ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ దువ్వూరు మండలంలో 6487మంది పిల్లలకు తల్లికి వందనం పడవలసి ఉండగా 5150మందికి ఇంతవరకు జమ అయిందని అన్నారు. మండలంలో 5230మంది పిల్లలు వివిధ పాఠశాల్లో చదువుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే పంచాయతీ రాజ్ తరపున ఇంటివల ప్రభుత్వం కోటి 66లక్షల రూపాయలు సిమెంట్ రోడ్లకు కేటాయించిందని పంచాయతీ రాజ్ శాఖ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్



**పులివెందుల, జూన్ 27, ప్రభాత వార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ అని పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక తెదేపా కార్యాలయం నందు శుక్రవారం సాయంత్రం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి తెదేపా నాయకులు మరియు ప్రజలు తమ సమస్యలు మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వేదిక వద్దే చరవాణి ద్వారా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా నేను మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని నిర్మోహమాటంగా ప్రజలు తమ సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. ఈ ప్రజా దర్బార్ నందు మండల పరిశీలకులు అజుగుట్టు రఘునాథ్ రెడ్డి , భరత్ రెడ్డి, మండల కన్వీనర్లు విశ్వనాథరెడ్డి ,రామముని రెడ్డి, తెదేపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

### నేడు అందుబాటులో బీటెక్ రవి

పులివెందుల పట్టణంలోని స్థానిక తెదేపా కార్యాలయం నందు నేడు ఉదయం 8 గంటల నుండి నియోజకవర్గ బీటెక్ రవి ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు కార్యాల వర్గాలు తెలిపాయి. అనంతరం ఆదివారం జరిగే విస్తృతస్థాయి సమావేశానికి సాయంత్రం విజయవాడకు బయలుదేరనున్నారు.

## భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి





**కడప, జూన్ 27 ప్రభాతవార్త**

జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాలు, లీగల్ క్లియరెన్స్ ప్రక్రియలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని జిల్లా జేసీ అధితి సింగ్ సంబందిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పెండెన్సీ పై.. శుక్రవారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి సంబందిత అధికారులు, ఆయా మండలాల తహశీలర్లతో జేసీ అదితి సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమీక్షకు విసి ద్వారా డిఎఫ్ఓ వినీత్ కుమార్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య సంబందిత రీజియన్ల ఎన్ హెచ్ఏఐ, ఎన్ హెచ్ పీడిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగుళూరు కడప విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి.. భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. తాజాగా కడప రేణిగుంట నాలుగు లేన్ల జాతీయ రహదారికి ఫారెస్ట్ క్లియరెన్స్ లభించిందన్నారు. అలాగే రోడ్డు విస్తరణ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ప్రతిపాధనలు, అనుమతులకు సంబంధించిన ఫైళ్లను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే ఫారెస్ట్, పర్యావరణ అభ్యంతరాలు, సవాళ్లు, కోర్టు కేసులు సంబందిత అంశాలను దాదాపుగా అధిగమించామన్నారు. కాగా ఇంకా ఇంకనూ పెండింగ్ లోవున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఏఐ ఎస్డీసి వెంకటపతి, పీడి అశోక్ కుమార్, ఆర్ బి నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎన్ హెచ్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**మదనపల్లి క్రైమ్ జూన్ 27 ప్రభాతవార్త.**

భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో కోలార్ నారాయణ హృదయాలయ వారిచే 20వ ఉచిత వైద్య శిబిరాన్ని అమ్మ చెరువు మిట్ట మున్సిపల్ హై స్కూల్ నందు ఈనెల 29వ తేదీన నిర్వహించన్నునట్లు బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం అమ్మ చెరువు మిట్ట మున్సిపల్ హై స్కూల్ నందు ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ మనిషి భౌతిక శ్రమకు దూరమై మానసిక ఒత్తిడికి ఎక్కువగా గురి అవుతున్న నేపథ్యంలో గుండె సంబంధిత జబ్బుల బారిన పడే వారి సంఖ్య ఎక్కువ అయిందన్నారు. గుండె జబ్బులు ప్రమాదకరమైనవి అయిన ప్రస్తుతం వాటికి ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్నదని సరైన సమయంలో గుండె జబ్బులను గుర్తించి వైద్యం చేయిస్తే ప్రాణాపాయ స్థితి నుండి సునాయాసంగా బయటపడవచ్చునన్నారు. గుండె జబ్బుల పై అవగాహన కల్పించడం, గుండెకు సంబంధించిన పరీక్షలతో పాటు బిపి, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించడం రోగ నిర్ధారణ అయినవారికి కోలార్ నందు గల నారాయణ హృదయాలయ వారిచే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా శాస్త్ర చికిత్సలు చేయించుకోవచ్చునన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి కోలార్ నారాయణ హృదయాలయ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ కిరణ్ కుమార్ గారి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడతాయని కావున 29వ తేదీన మదనపల్లి అమ్మ చెరువు మిట్ట మున్సిపల్ హైస్కూల్ నందు నిర్వహిస్తున్న నారాయణ హృదయాలయ వారి ఉచిత గుండె వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని గుండె జబ్బులకు దూరంగా ఉండాలని వీరు కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు సూరి, గంగాధర్, పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఎలక్ట్రిక్ వాహనం పేలి మహిళ మృతి

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 27, ప్రభాతవార్త:**

ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో ఎలక్ట్రిక్ స్కూటీ పేలి వృద్ధమహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఛార్జింగ్ పెట్టడంతో తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో అకస్మాత్తుగా వాహనం పేలడంతో పక్కనే నిద్రిస్తున్న వెంకటలక్ష్మి(62) అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనలో ఛార్జింగ్ ఉపయోగించిన ప్లగ్‌పాయింట్ వాహనంలో ఏదైనా లోపం ఉందా, అనే కోణంలో అధికారులు పరిశీలిస్తున్నారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనం పేలుడు కారణాలను అన్వేషిస్తున్నారు. ఫోరెన్సిక్ టీంను రప్పించి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా వాహనం తయారు సంస్థకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఏది ఏమైనప్పటికీ విధ్వంసకర ఘటనలు జరగకుండా ఎలక్ట్రిక్ వాహనాలు నిర్వహణ, భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం అత్యంత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. వెంకటలక్ష్మమ్మ పెద్ద కుమరుడు ఆర్టీపీపీలో ఏఈగా పనిచేస్తున్నారు. చచిన్న కుమారుడు వ్యవసాయం చేసుకుంటుంటున్నాడు. ఆయన వద్ద ఆమె ఉంటోంది. లక్ష్మమ్మ భర్త 20 సంవత్సరాల క్రితం మృతి చెందారు. ఇంటికి పెద్ద దిక్కు అయిన ఈమె చనిపోవడంతో కుమారులు సోకసంద్రంలో మునిగిపోయారు.







## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**రాజుపాళెం, జూన్ 27, ప్రభాతవార్త:**

ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు, యువత పెడదోవ వంటి అంశాలు పట్టి పీడిస్తున్నాయని ట్రైనీ డీఎస్పీ భావణి అన్నారు. మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరైన ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా సైబర్ నేరాల ద్వారా మోసపోవడం జరుగుతున్నదని వీటిపైన అవగాహణ కలిగి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పెద్దలు, వారి పిల్లలు ఎలా నడవడిక ఉన్నదని గమనిస్తూ వారు పెడద్రోవ పట్టకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చిన్న పిల్లలకు బైక్‌లు ఇచ్చి ప్రమాదాలకు గురి కాకుండా చూసుకోవాలని, హెల్మెట్ తప్పకుండా వాడాలని, బెల్టు షాపుల నిర్మూళణకు ప్రజల సహకారం అవసరం అని, రచ్చబండల వద్ద వ్యవసాయం, మంచి విశయాలు మాట్లాడుకోవాలని రాజకీయం కానీ విరోధంగా వ్యవహరించి గొడవలు పడరాదని తెలిపారు. ముఖ్యంగా యువత పెడద్రోవ పట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



## సర్వర్ ప్రాబ్లమ్ లేకుండా చూడండి

**వేంపల్లె: జూన్ 27 (ప్రభాత వార్త):**



గ్రామ సచివాలయాల్లో సర్వర్ ప్రాబ్లమ్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా ఆమ్‌ఆద్మీపార్టీ కోఆర్డినేటర్ రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులతో కలిసి శుక్రవారం తహశీల్దార్ హరినాద్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. సర్వర్ డౌన్ కావడంతో బయోమెట్రిక్, ప్రభుత్వ రేషన్ బియ్యం పంపిణి తదితర అంశాలపైన ఆయన తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామసచివాలయలలో వయసు పైపడిన వారికి వేలి ముద్రలు పడని కారణంగా వారి కోసం ఐ బైయోమెట్రిక్ విధానాని ఆన్లైన్ పొందుపరిచే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్ మండలం సభ్యులు గౌస్, షఫీ భాయ్, అహమద్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ట్రస్ట్ వారి సహకారంతో విద్యాసామా వితరణ

బద్వేలు అర్బన్, జూన్ 27, ప్రభాతవార్త

బద్వేల్ పట్టణంలోని సిద్దవటం రోడ్డు ఎరుకల పాలెం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం తిరుమల ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అర్బన్ సీఐ రాజగోపాల్,ఎక్సైజ్ శాఖ సీఐ సీతారామిరెడ్డి, బి కోడూర్ ఎస్సై వెంకట సురేష్ లు మాట్లాడుతూ అన్ని దానాలలో కల్లా విద్యాదానం ఎంతో గొప్పదని, తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత విద్య అభ్యసించామని ,ఏదైనా సాధించాలంటే పట్టుదల ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. గతంలో తమకు ఇన్ని సౌకర్యాలు లేవని ఇప్పటి విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించడంతోపాటు ఇలాంటి స్వచ్ఛంద సేవా సంస్థల వారు తమ సహకారం అందిస్తుండటం ఎంతో అభినందనీయమని వారి సేవల గురించి ఎంత చెప్పినా తక్కువేనని తెలియజేశారు. గత 16 సంవత్సరాలుగా బద్వేల్ ప్రాంతంలో తిరుమల ట్రస్ట్ బెంగళూరు వారి సహకారంతో ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రి వితరణ చేపట్టడం సంతోషకరమన్నారు . ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే తిరుమల ట్రస్ట్ వారి ని స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని సేవా సంస్థల వారు ముందుకు రావాలని కోరారు. అనంతరం తిరుమల ట్రస్ట్ వారి సేవలను వారు ప్రశంసించారు, అనంతరం ఆవోపా సెక్రటరీ సి.వి నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఎం. వెంకటరమణలు దాదాపు 16 సంవత్సరాలు ఏకధాటిగా ఇలాంటి వితరణ కార్యక్రమాలు చేపడుతున్నారంటే తిరుమల ట్రస్ట్ వారి సంకల్పబలం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ట్రస్ట్ వారి సేవలు ఇలాగే కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగ భూషణ రాజు, ఉపాధ్యాయురాలు జయమ్మ, అరుణ, సంగీత తదితరులు పాల్గొన్నారు

## డబులింజన్ సర్కార్ దూసుకు పోవడం లేదు

వేంపల్లి: జూన్ 27 (ప్రభాత వార్త):

రాష్ట్రం లో డబులింజన్ సర్కార్ దూసుకు పోతున్న దని పవన్ కళ్యాణ్, కూటమి నాయకులు చెప్పడం హాస్యాస్పదమని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు.శుక్రవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకుపోతున్న దని,అభివృద్ధిలో చతికిల పడిందని ఎద్దేవా చేశారు. 2023 24 లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన గ్రాంట్ రు 34,698 కోట్లు కాగా 202425 లో రు 20,135 కోట్లు మాత్రమే వచ్చింది. అనగా రు 14,563 కోట్లు తగ్గింది. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మాణం కాలేదు. దుగరాజపట్నం ఓడ రేవు నిర్మాణం కాలేదు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం గ్రాంట్ ఇవ్వలేదు.అప్పు తెచ్చుకోమని చెబుతోంది. ఈ విధంగా రాష్ట్రం లో డబులింజన్ కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకు పోతోంది, అభివృద్ధిలో చతికిల పడింది.

## పట్టణంలో పర్యటించిన జడ్పీ సీఈవో



వేంపల్లి: జూన్ 27 (ప్రభాత వార్త):

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా జడ్పీ సీఈవో ఓబులమ్మ వేంపల్లి పట్టణంలో పర్యటించారు. వేంపల్లి పట్టణంలో పారిశుధ్యం పనులపై ఆమె ఆరా తీశారు. పటణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ,వెంటనే పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వేంపల్లి జడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తో కలిసి పట్టణంలోని బాలుర , బాలికల ఉన్నత పాఠశాలల్లో ఆమె మౌలిక వసతులను పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలను ఆమె పరిశీలించారు. పాఠశాలలో చుట్టూ ప్రహరిగోడ పై , ఆర్వో వాటర్ ప్లాంట్ పై మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆమెతో చర్చించారు. బాలికల ఉన్నత పాఠశాలలో నీళ్ల ట్యాంకు లీకేజీ అవుతోందని దీంతో ఆ నీరు క్లాస్ రూమ్ లల్లో ఉరుస్తోందని, ఈ విషయాన్ని జిల్లా జడ్పీ సమావేశంలో కూడా చర్చించినట్లు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి సీఈఓ ఓబులమ్మ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మౌలిక వసతులు కూడా కల్పించాలని అన్నారు. నీళ్ల ట్యాంకి ని వెంటనే మరమ్మతులు చేయిస్తామని ఆమె తెలిపారు. నాడు నేడు కింద కట్టిన కొన్ని గదులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ ఆదేశాల మేరకు గదులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే వేంపల్లి లోని జడ్పీ కి సంబంధించిన అద్దె గదులకు కొంత మంది సరిగా అద్దె చెల్లించకపోవడంతో వాటిని కూడా ఆమె పరిశీలించారు. వెంటనే గదులకు అద్దె చెల్లించాలని దుకాణాదారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి , కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, వేమ కుమార్, దక్కారమేష్, దక్కా శీను వాసులు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి వినతి.



తంబళ్లపల్లె జూన్ 27 ప్రభాతవార్త ః

రాష్ట్ర సర్వేయర్ల సంఘం సర్వేయర్ల సమస్యలపై మాస్ క్యాజువల్ లీవ్ పెట్టి రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి మద్దతు గా తంబళ్లపల్లె మండల సర్వేయర్లు సంఘీభావం తెలుపుతూ తమ సమస్యల పరిష్కారానికి ఎంపీడీవో థామస్ రాజాకు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం మండల సర్వేయర్లు మాట్లాడుతూ సర్వేయర్లకు డిపార్ట్మెంట్ ప్రమోషన్లు ఇవ్వాలని, ఇంక్రిమెంట్లు తోబాటు బదిలీల ప్రక్రియలో అపారదర్శకతను మరియు రేషలైజేషన్ లో పొజిషన్ లేని గ్రామ సర్వేయర్ల కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు గణేష్, ఫక్రుద్దీన్, భార్గవ్, అనిత, గాయత్రి, వినోద్, అశోక్, ప్రతాప్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి లు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు పై వెళుతున్నట్లు ఎంపీడీవో కు వినతిపత్రం

లక్కిరెడ్డిపల్లె ; జూన్ 27, ప్రభాతవార్త

మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు పరివారం ఎక్కువైందని సామూహిక సెలవు పై వెళుతున్నామని శుక్రవారం ఇంచార్జ్ ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఉద్యోగులు చేయలేని విధంగా పంచాయతీ కార్యదర్శులు చేత ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనులు చేయిస్తున్నారని ఈ పనులు మేము చేయలేదని సెలవు వెళ్తున్నామని వారన్నారు పారి సిద్ధం పేరున జిల్లా అధికారులు గ్రూప్ కాల్ చేయడం గ్రామాలలో నీటి ట్యాంకులను దినదిన శుభ్రం చేసి ఫోటోలు తీసి పంపాలని వేధించడం పాటు సచివాల నిర్వాహన వివిధ వ్యయప్రయాసాలతో ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయాన్ని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమైక్యని తీసుకొని సామూహిక సెలవు పై వెళుతున్నట్లు వారు తెలిపారు తడి చెత్త పొడి చెత్త సేకరణకు మూడు చక్రాల సైకిల్ , చెత్త బుట్టలు పంపిణీ గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు కనీసం నెలకు పదివేలు తగ్గకుండా ప్రభుత్వమే ఇవ్వాలని వారు వినపత్రల పేర్కొన్నారు ఎక్కువ పని గంటలకే కేటాయించడంతో తమ వ్యక్తిగత కుటుంబ జీవితానికి దూరం అవుతున్నామని మహిళా పంచాయతీ కార్యదర్శులు చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాకు న్యాయం చేయాలని వారు వినపత్రలో పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జనరల్ సెక్రెటరీ రజనీష్ రెడ్డి మల్లికార్జునరెడ్డి నాగమణి పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఆస్తులు కొనుగోలు చేసే క్రమంలో అన్ని జాగ్రత్తలు తీసుకోండి



ప్రొద్దుటూరు జూన్ 27 ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఆస్తులు కొనుగోలు చేసే క్రమంలో ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణంలో నకిలీ డాక్యుమెంట్ల ముఠాల వల్ల మోసానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు లో ప్రజల ఆస్థికి భద్రత కరువైందని, నకిలీ పత్రాలతో కాజేసే వ్యక్తులు వున్న నేపథ్యంలో జాగ్రత్తగా వుండాలని సూచించారు. గత కొన్ని రోజుల నుండి మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో వున్న ఎంపిపి శేఖర్ యాదవ్ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమి వారిదంటూ అర్ధరాత్రివేళ అక్కడి నిర్మాణాలను తొలగించే యత్నం చేయడంతో ఆ భూమికి పట్టణానికి చెందిన ఓ కౌన్సిలర్ నకిలీ పత్రాలు సృష్టించారని, 1985లో ఆ భూమిని ఆ కౌన్సిలర్ బంధువులు కొన్నట్టు, 1980లో ఆ భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ వారి బంధువుల పేరుతో సృష్టించారని వివరించారు. ఈ తతంగం మొత్తం కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంలో జరిగిందని స్పష్టం చేశారు. ఈ భూమిని ఒక వ్యక్తి వద్ద దాదాపు 25 లక్షలకు తనఖా పెట్టడంతో పాటు, మరో వ్యక్తి వద్ద అడ్వాన్స్ తీసికొని విక్రయించారని, కాగా ఈ భూమి డాక్యుమెంట్ వున్న వ్యక్తికి ఆ భూమి అతని జననానికి ముందే ఎలా సంక్రమిస్తుందని ప్రశ్నించారు. కానీ ఈ భూమిని నిజాయితీగా గత 6 నెలల క్రితం కొన్న ఎంపిపి శేఖర్ యాదవ్ వద్ద అసలైన డాక్యుమెంట్లతో పాటూ హిస్టరీ వుందని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎంపిపి కి ఈ భూమి విక్రయించిన వ్యక్తి నేటికీ ఈ ఇబ్బందులు చూడలేక తిరిగి కొని డబ్బులు ఇస్తానని చెప్పి హుందాగా వ్యవహరించడం తన మంచి వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు. ఈ నకిలీ డాక్యుమెంట్లు, సీల్, అదికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన వ్యక్తులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, కుమారుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అభయం వుందని, అందువలనే పోలీసులు వారి పైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పోలీసులపై ఎన్నడూ రాజకీయ నాయకుల జోక్యం వుండకూడదని తెలిపారు. ఈ విషయంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి సామాన్య ప్రజలు మోసానికి గురికాకుండా కాపాడవలసిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ప్రజా ప్రతినిధుల పరిస్థితే ఈ విధంగా వుంటే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై ఎంపిపి శేఖర్ యాదవ్ డిఎస్పీ, ఎస్పీ తో పాటు రిజిస్టార్ అండ్ స్టాంప్స్ ఐజీ కి ఫిర్యాదు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, రాగుల శాంతి, మన్నె సత్యం, గరిశపాటి లక్ష్మిదేవి, నాగేంద్ర రెడ్డి, పాతకోట ముని వంశీధర్ రెడ్డి, అనిల్, గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ బీరం రాఘవేంద్ర రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక సెలవు కోసం ఎంపీడీవో కు వినతి



తంబళ్లపల్లె జూన్ 27 ప్రభాతవార్త ః

గ్రామ సచివాలయ కార్యదర్శుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కార్యదర్శుల సమాఖ్య సూచనల మేరకు శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడానికి తరలి వెళుతున్నామని ఇందుకు సెలవు మంజూరు చేయాలని శుక్రవారం మండలంలోని కార్యదర్శులు ఎంపీడీవో థామస్ రాజాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యదర్శిలు ఉదయం 6 గంటలకే చెత్త సేకరణ పనుల తోబాటు పలు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సమైక్య ఇచ్చిన పిలుపు కు సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సోమశేఖర్, జమీర్, శ్రీనివాసరావు, ధనుంజయ, సుశీల, గీతా రాణి, రంజిత్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## రేపు మాతమ్మ జాతర

పెనగలూరు జూన్ 27 ప్రభాతవార్త

మండలంలోని నల్లపురెడ్డిపల్లి అరుంధతి వాడలో ఆదివారం గ్రామ దేవత మాతమ్మ జాతర జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. మాతమ్మ తో పాటు ఎల్లమ్మ గంగమ్మ దేవతలకు కూడా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహింపబడతాయని ఈ సందర్భంగా తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి నుంచి పోతుల రాజుతో అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో బ్రహ్మోత్సవం కార్యక్రమం ఆశాధికత తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేయబద్దాయని ఈ సందర్భంగా తెలిపారు.

## ఖరీఫ్ కాల పంటలకు బీమా చేయించండి

బ్రహ్మంగారిమఠం జూన్ 27 ప్రభాతవార్త:



బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని సోమిరెడ్డి పల్లె1,2 రైతు సేవా కేంద్ర పరిధిలోని రైతులు ఖరీఫ్2025, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం మరియు వాతావరణ ఆధారిత పంట బీమా పథకం ద్వారా ఖరీఫ్ పంట కాలంలో రైతులు చెల్లించ వలసిన ప్రీమియం ఎకరాకు వరి84, కంది36, జొన్నలు38, మినుములు38, పసుపు 180, ఉల్లి90, పత్తి2000, వేరుశనగ560, బత్తాయి 2750, అరటి 3025,సాగు చేసే రైతులు తమ వంతు భీమా పరిహారాన్ని బ్యాంక్ లు, సీఎస్సీ సెంటర్లు, పోస్ట్ ఆఫీసుల ద్వారా చెల్లించాలని అధికారి సాయి కుమార్ తెలిపారు. పత్తి,వేరుశనగ, బత్తాయి, అరటి సాగు చేసే రైతులు తమ వంతు భీమా పరిహారాన్ని జూలై 15 తేదీ లోపల చెల్లించాలని, వరి,కంది,జొన్నలు,మినుములు, పసుపు, ఉల్లిసాగు చేసే రైతులు తమ వంతు భీమా పరిహారాన్ని జూలై 31 తేదీ లోపల చెల్లించాలని గ్రామ వ్యవసాయ సహాయకుడు సాయికుమార్ తెలిపారు. పంట నాటిన ధ్రువీకరణ పత్రం కొరకు మీ పరిధిలోని రైతు సేవా కేంద్ర అధికారిని సంప్రదించండి.

## ప్రిన్సిపల్‌గా గురుమూర్తిరెడ్డి పూర్తి అదనపు బాధ్యతలు

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 27, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న పి.గురుమూర్తిరెడ్డి ఇటీవల పూర్తి అదనపు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. శుక్రవారం ఉదయం ఆయన అధికారికంగా ఈ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఛాంబర్‌లో విభాగాధిపతులు, బోధన మరియు బోధనేతర సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి గురుమూర్తి రెడ్డి మాట్లాడారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ అభివృద్ధికి తన సేవలను అంకితం చేస్తానని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. కళాశాల అభివృద్ధి పథంలో విభాగాధిపతులు మరియు బోధన సిబ్బందితో తనతో కలిసి పనిచేయాలని కోరుతూ వారి సహకారమే విజయానికి పునాది అన్నారు. గతంలో గురుమూర్తిరెడ్డి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సమన్వయకర్తగా వ్యవహరిస్తూ ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి దాతల సహకారంతో నగదు ప్రోత్సాహక బహుమతులు అందించడం, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడం వంటి కార్యక్రమాలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. గురుమూర్తిరెడ్డికి శాలువా కప్పి పూలగుత్తులు సమర్పిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు అశోక్‌బాబు(మెకానికల్), మంజునాథ్(ఈఈఈ), వవీరభద్రారెడ్డి(ఈసీఈ), విజయకుమార్(సీఎస్ఈ)లతో పాటు బోధన మరియు బోధనేతర సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సామూహిక సెలవుపై వెళ్లడంపై వినతిపత్రం

కలికిరి, జూన్ 27, ప్రభాతవార్త:

కలికిరి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించేందుకు ఈనెల 28వ తేదీ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వెళ్లేందుకు సామూహిక సెలవు ఇవ్వాలని శుక్రవారం కలికిరి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో భానుమూర్తిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కలికిరి పంచాయతీ ఈవో అశోక్, పంచాయతీ కార్యదర్శులు తిమ్మారెడ్డి, నవాజుల్లా, గోపీ, గిరి, రిషి, మౌనిక, షబానాబాను, అపీప, హరిత, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

## పారిశుధ్యాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ

దువ్వూరు, జూన్ 27, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఇడమడకలో గ్రామ పంచాయితీ తరపున జరుగుతున్న పారిశుధ్యపు చర్యలను ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఐవీఆర్ఎఫ్ సర్వే ద్వారా మండల స్థాయి అధికారి ఒక గ్రామానికి వెళ్లి పారిశుధ్య చర్యలను పరిశీలించాలని అదేశించింది. అందులో భాగంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యపు చర్యలను ఎంపీడీఓ పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తీసుకోవాలని, అలాగే వీధుల్లో ఎక్కడ నీరు నిలబడకుండా చూడాలన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు



పోరుమామిళ్ల రూరల్, జూన్ 27 ప్రభాతవార్త:

పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలను కలెక్టర్ విన్నవించేందుకు శనివారం కడపకు వెళ్లాలని సామూహిక సెలవు పెట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉపేంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఐ విఆర్ఎస్ కాల్స్, సమయపాలన లేని అని ఒత్తిడి , స్వచ్ఛసంకల్పానికి నిధులు కేటాయింపు చేయకున్నా పారిశుధ్య సిబ్బందితో పని చేయించాలంటు ఒత్తిడి చేయడం తత్తర సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, రవీంద్రారెడ్డి, చెన్నకేశవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నారాయణ బాబు, భాష, వెంకట లక్ష్మి, రాజేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు కార్యాలయంలో సంఘ మిత్రల సమావేశం



కలికిరి, జూన్ 27, ప్రభాతవార్త:

వెలుగు కార్యాలయంలో శుక్రవారం సంఘ మిత్రల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రాజెక్టు డైరెక్టర్ హాజరై ప్రసంగించారు. ఎస్‌హెచ్‌జీ, ఎంసీఎం (హెచ్‌ఎల్‌పీ)ల గురించి, ఉన్నతి, శ్రీనిధి, వీఓ అప్పుల రికవరీ గురించి చెప్పారు. బ్యాంక్‌లకు వెళ్లి హెచ్‌ఎల్‌పీల గ్రౌండింగ్ చేయమని చెప్పడం జరిగింది. జిల్లా నుంచి ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, డీపీఎం గంగార్జున, డీపీఎం వేణుమాదవ్, ఏపీఎం ఎఫ్‌పీఓ, మండల ఏపీఎం, సీసీలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు. శ్రీనిధి మేనేజర్ మౌనిక శ్రీనిధి లోన్ మరియు రికవరీల గురించి మాట్లాడారు.

## గ్రామాల్లో ఉద్యోగస్థులు బాధ్యతగా విధులు నిర్వహించాలి-ఎంపీడీఓ

రాజుపాళెం, జూన్ 27, ప్రభాతవార్త:

గ్రామ సచివాలయాల్లో పనిచేయు ప్రతి అధికారి ప్రజా సమస్యల పరిష్కారం నకు కృషి చేస్తూ వారి ఉద్యోగ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఎంపీడీఓ ఎం .రామనాథ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సచివాలయ అధికారులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించుకొనుటకు కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల చిన్న చూపు చూడరాదని వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యాలయాల్లో విధులలో ఉన్నప్పుడు పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా బయటికి వెళ్లరాదని కావాలంటే సెలవుల అనుమతితో వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి షాకీర్ అలీఖాన్, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వనం-మనం కార్యక్రమం

పెండ్లిమర్రి, జూన్ 27, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 30 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, మండల టీడీపీ ఇన్‌ఛార్జి రంగారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, తెలుగు ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి, జంతుశాస్త్ర ఉపన్యాసకులు రాజగోపాల్‌రెడ్డి, వృక్షశాస్త్ర ఉపన్యాసకులు మధుసూదన్‌రెడ్డి పాల్గొని యువత శక్తిని సద్వినియోగం చేసుకోవాలని సేవాదృక్పథం అలవాటు చేసుకోవాలని చక్కగా చదువుకొని అభివృద్ధి సాధించాలని, పర్యావరణ స్నేహశీలిగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇందిర ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ పీఓ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణిత అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

పెండ్లిమర్రి, జూన్ 27, ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం బోధించుటకు అతిథి అధ్యాపక పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవసరమైన సర్టిఫికెట్లతో తమ దరఖాస్తును 29వ తేదీ లోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో వేలం పాటలు

బ్రహ్మంగారిమఠం జూన్ 27 ప్రభాతవార్త:



జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం ప్రాంగణంలో శ్రీ కనుమ పోలేరమ్మ గుడి దగ్గర ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ మరియు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆలయానికి సంబంధించిన భూములకు వేలం పాటలను దేవస్థానం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం మండలంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 486,487 సర్వే నెంబర్లో గల 11 ఎకరాల 28 సెంట్లు భూమిని లీజుకు ఇచ్చేందుకు వేలంపాట వేయడం జరిగినది.ఈ వేలం పాటలో తిప్పన మాధవ నాయుడు ఒక సంవత్సరానికి మూడు లక్షల 14 వేల రూపాయలు లీజు అమోంట్ చెల్లించేలా వేలంపాట దక్కించుకున్నారు. సంవత్సరాల కొద్దీ నిరుపయోగంగా ఉన్నటువంటి భూమిని మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ముందుచూపు ఆలోచనతో సాగు చేసుకునే విధంగా తయారుచేసి సంవత్సరానికి మూడు లక్షల 14 వేల రూపాయలు ఆదాయం వచ్చేలా కృషి చేయడం చాలా గొప్ప విషయం. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కడప మీదుగా వందే భారత్ రైలు

రాజంపేట, జూన్ 27 ప్రభాతవార్త



ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ రైలు కడప మీదుగా శుక్రవారం వెళ్ళింది. చెన్నై హైదరాబాద్ మధ్య వందే భారత్ రైలు అని చాలామంది భావించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో కూడా వైరల్ అయింది. దీనికి తోడు కొత్త రైలు కావడంతో అందరూ ఇదేనని అనుకున్నారు. విషమై కడప రైల్వే అధికారిని సంప్రదించగా సమాచారం లేదని వెల్లడించారు. దీంతో గుంటకల్ లోని రైల్వే కమర్షియల్ ఇన్స్పెక్టర్ హేమంత్ ను ఖివార్త ఖివివరణ కోరింది. ట్రయల్ రన్ కాదని స్పష్టం చేశారు. చెన్నై లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నుంచి కొత్తగా తయారైన వందే భారత్ రైలు అని తెలిపారు. కాదంటే రేణిగుంట, రాజంపేట ,కడప మీదుగా రైలు వెళ్లిందని తెలియజేశారు. ఏదేమైనా నిజంగా అయినా గుంటకల్, కడప, రాజంపేట ,రేణిగుంట మీదుగా వందే భరత్ రైలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## జూద స్థావరాలపై పోలీసులు మెరుపుదాడి

రామసముద్రం, జూన్ 27 ప్రభాతవార్త

జూదం ఆడుతున్న వారి పై దాడి ఐదు మందిని అరెస్ట్ చేసిన ఎస్సై రమేష్ బాబు తెలిపారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని దిగువ పేట చింత చెట్టు క్రింద పెద్ద ఎత్తున జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై రమేష్ బాబు పోలీస్ సిబ్బంది మెరుపు దాడి చేసి ఐదు మంది జూదరులను రాయుళ్లను అదుపులో తీసుకొన్నట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు. వారినుంచి 5,580 /రూపాయలు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

## తహసీల్దారును కలసిన ఎరుకుల సంఘం అధ్యక్షులు



రామసముద్రం, జూన్ 27 ప్రభాతవార్త

ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎరుకుల అధ్యక్షులు రామకృష్ణ, మాలమహానాడు నాయకులు శుక్రవారం రామసముద్రం మండల తహశీల్దార్ మహ్మద్ అజారుద్దీన్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ కు దుష్యాలవలతో సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా రామకృష్ణ, మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ మండలంలో ఎస్టీ, ఎస్సీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని,ఎస్టీ, ఎస్సీల అభివృద్ధికి దోహదపడాలని తెలియ జేశారు.వెంటనే స్పందించిన తాహశీల్దార్ ఎస్టి, ఎస్సీల అభివృద్ధికి అన్ని రకాల సహకరిస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎరుకల అధ్యక్షుడు రామకృష్ణ, పలమనేరు డివిజనల్ మాల మహానాడు అధ్యక్షుడు శేషాద్రి, మండల మాల మహానాడు గౌరవ అధ్యక్షులు నారాయణస్వామి, ఈశ్వరప్ప,క్రిష్ణప్ప, మాల మహానాడు మండల యూత్ అధ్యక్షులు నరసింహులు, సోమశేఖర్, సిటి గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వినికిడి అవగాహన శిబిరం..




ప్రొద్దుటూరు, జూన్ 27, ప్రభాతవార్త

స్థానిక శ్రీకృష్ణ గీతా ఆశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వినికిడి అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం నందు విజయవాడ నుంచి డాక్టర్ శ్రీనివాస్ పట్టణ ప్రజలు, కళాశాల విద్యార్థిని విద్యార్థులకు వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగే లోపే మనం తగు జాగ్రత్తలు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటామని, కావున మన శరీర భాగాల్లో ఉన్నటువంటి చెవులు ఎంతో కీలకమైనటువంటి పాత్రను పోషిస్తాయని, మనం ఒకరి నుంచి ఒకరికి మాట్లాడే కమ్యూనికేషన్ శబ్దం ద్వారానే తెలుస్తుందని, కాబట్టి దానిలోపాలు ఎవరైనా ఉన్నా ఇప్పుడే తెలుసుకొని తగు జాగ్రత్తలు పడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ పర్లపాడు గౌరీ శంకర్, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ శారదా భవాని, ఎన్సిసి ఇన్స్పెక్టర్ దావీదు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

పీలేరు జూన్ 27 ప్రభాతవార్త:



కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన అబ్బారపు శ్రీనివాసులు పీలేరు మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా ముచ్చటగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీకి నిస్వార్థ సేవకుడిగా పేరున్న అబ్బారపు శ్రీనివాసులు చిన్నతనం నుంచి తెలుగుదేశం పార్టీకి సేవలు అందిస్తున్నారు. పీలేరు సింగల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డికి అనుచరుడైన శ్రీనివాసులు సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరుంది. ఆయన మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవ్వడం పట్ల పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వర్షం వ్యక్తం చేశారు. ఆయనను అభినందించారు.

### CHANGE OF NAME

SIVA SANKAR REDDY KOMATI REDDY S/o KOMATI REDDY SUBBAREDDY D/no: 8-68 Thurpupalli (Vill) itimarpuram (post) Penagalur (M) Annamayya (Dist) A.p.,I have changed my Name from KOMITIREDDI SIVA SANKAR REDDY S/o KOMATI REDDY SUBBAREDDY (Old Name) to SIVA SANKAR REDDY KOMATI REDDY S/o KOMATI REDDY SUBBAREDDY(New Name)

### పేరు మార్పు

ప్రొద్దుటూరు మండలం, సోములవారిపల్లె పంచాయతీ, ఈశ్వరరెడ్డి నగర్ 10/97, వైఎస్ఆర్ కడప జిల్లా ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన దేవిరెడ్డి బాలగుర్విరెడ్డి (BalagurviReddy) (old name) S/o దేవిరెడ్డి గురివిరెడ్డి, అనే నేను దేవిరెడ్డి బాలగురివిరెడ్డి (Balagurivi Reddy ) (new name) S/o దేవిరెడ్డి గురివిరెడ్డిగా మార్చుకోవడం జరిగింది. కావున గమనించగలరు.

## విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసాలు అలవడాలి

### వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు కృష్ణకుమారి

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)



విద్యార్థి దశ నుండే వ్యక్తిత్వ వికాసాలు అలవాడాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆమె సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ప్రతి విద్యాసంస్థ ప్రత్యేకతలతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసాన్ని బోధించాలన్నారు. అప్పుడే సమాజములోని రుగ్మతలు చాలా వరకు రూపుమాపబడతాయి అన్నారు. అంతకు ముందుగా శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత కొండూరు శరత్ కుమార్ రాజు కృష్ణకుమారికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

## కొండచిలువను పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు



ముద్దనూరు, జూన్ 27, ప్రభాతవార్త:
స్థానిక పట్టణంలోని జమ్మలమడుగు ఘాట్ రోడ్డు వద్ద ఒక తోటలో శుక్రవారం కొండచిలువ కోళ్లను వేటాడి తింటుండగా తోట యజమాని తుమ్మలూరు వేణు గోపాల్ రెడ్డి గమనించి ఫారెస్ట్ డిఆర్ఓ శ్రీనివాసులు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ అధికారులు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని కొండచిలువను చాకచక్యంగా సురక్షితంగా గోనె సంచిలో పట్టుకుని అడవిలో ఎవరు లేని ప్రదేశంలో వదిలేశామని తెలిపారు.

## ఎంపీడీవోగా రాధా కృష్ణవేణి

ముద్దనూరు, జూన్ 27, ప్రభాతవార్త:



పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలో ఎంపీడీవోగా పనిచేస్తున్న రాధాకృష్ణవేణి కడప జిల్లా అధికారులు ఆదేశాల మేరకు సాధారణ బదిలీలలో భాగంగా ముద్దనూరు మండల ఎంపీడీవోగా శుక్రవారం నాడు ఆమె బాధ్యతలు స్వీకరించారు. పరిపాలన అధికారి పరిపూర్ణ అరుంధతి పుష్పగుచ్చముతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎండిఓ మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజాప్రతినిధులు ప్రజలు సహకరించాలని తెలిపారు.

## ఇసుక అక్రమరవాణా అడ్డుకట్ట

### ఎస్సై మహమ్మద్ రఫీ

సిద్ధవటం జూన్ 27 ప్రభాతవార్త
ఉచిత ముసుగులో ఇసుక అక్రమ రవాణా పాల్పడుతూ జిల్లా కేంద్రానికి ట్రాక్టర్ల ద్వారా తరలింపు చేసి ఒక్కో ఇసుక ట్రాక్టర్ విలువ, 4, వేలు, రూ, కాసులు సంపాదిస్తున్న ఇసుక అక్రమ రవాణాదారులకు మండల ఎస్సై మహమ్మద్ రఫీఅడ్డుకట్ట వేశారు. మండల కేంద్రమైన సిద్ధవటం పెన్నా నది హై లెవెల్ వంతెన సమీపాన రైతుల పంట పొలాలు సమీపాన ప్రతిరోజు, అక్రమంగా ఇసుక ట్రాక్టర్ల ద్వారా కడపకు రవాణా చేసి, 4, వేలు, రూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని కొంతమంది రైతులు మండల ఎస్సై కి ఫిర్యాదు చేయడంతో అక్రమ ఇసుక రవాణా పాల్పడకుండా పెన్నా నదిలోకి వెళ్లే రహదారిని జెసిబి యంత్రాలతో గోతులు తీయించారు ఈ సందర్భంగా మండల ఎస్సై మహమ్మద్ రఫీ శుక్రవారం మాట్లాడుతూ పెన్నా నది హై లెవెల్ వంతెన సమీపన కొంతమంది ప్రతిరోజు ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల ద్వారా కడపకు తరలిస్తున్నట్లు రైతుల నుండి ఫిర్యాదు రావడంతో అక్రమ ఇసుక రవాణా జరగకుండా రహదారిని జెసిబి యంత్రంతో గోతులు తీయించామని ఉచిత ఇసుక రవాణా గ్రామంలో ఉన్నవారు మాత్రమే గృహ నిర్మాణ పనులకు తోలుకోవాలని అంతేతప్ప ఇసుక ఉచితం ముసుగులో అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా కడపకు రవాణా చేయడం తగదని అక్రమ రవాణా అరికట్టేందుకు భాకరాపేట, బండి కనుమ, కమ్మపాలెం రహదారుల్లో విస్తృత తనిఖీలు చేపడతామని ఎస్సై మహమ్మద్ రఫీ అన్నారు

## మాచుపల్లిలో పారిశుద్ధ పనులు

సిద్ధవటం జూన్ 27 ప్రభాతవార్త



మాచుపల్లి గ్రామంలో త్రాగునీటి ట్యాంకులు, పలు రహదారిలో అపశుభ్రత ప్రాంతాల తొలగింపు చేపట్టామని ఇంచార్జ్ పంచాయతీ సెక్రటరీ రియాజ్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాచుపల్లి గ్రామ సచివాలయంలో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ మల్లు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన గ్రామంలోని కడప, మాచుపల్లి రహదారి శాంతినగర్ వద్ద రోడ్డుపై ఉన్న మురికి నీరు తొలగింపు చేపట్టామని శాంతినగర్, మాచుపల్లి గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచావని పలు రహదారిలో ఉన్న అపరిశుభ్రత తొలగింపు వేగవంతం చేశామని తెలిపారు గ్రామంలో విద్యుత్ దీపాలు తాగునీటి సమస్య పరిష్కారం కొరకు చొరవ చూపుతానని ఇన్చార్జి పంచాయతీ సెక్రటరీ రియాజ్ తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శులకు పని భారం ఒత్తిడి తగ్గించాలని వినతి



పెద్దమండెం జూన్ 27 ప్రభాతవార్త
మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పని భారం అధిక ఒత్తిడి కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని పని భారం తగ్గించాలని శుక్రవారం ఎంపీడీవో శ్రీధర్‌రావుకు పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా పంచాయతీలలో సర్వేలు స్వర్ణ పంచాయతీ పనులు ఇంటి పన్ను విఆర్‌వన్ ఏపీ రెవెన్యూ మరి పిజిఆర్ఎస్ పనులు గ్రామసభలో పంచాయతీ అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు ప్రోటోకాల్ ఎన్నికల విధులు ఇవి కాక పంచాయతీ కమిషనర్ చెత్త నుండి సంపద సృష్టి ఉదయం ఏడు గంటలకే గ్రామాలకు వెళ్లి చెత్త సేకరణ క్లోరినేషన్ పనులు తేదీ కనపడేలా పేపర్ పట్టుకుని న్యూస్ పేపర్ పట్టి ఫోటోలు తీసి పంపాలని కార్యదర్శులు దొంగలుగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. ఇలా చేయకుంటే సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారు ఈ నేపథ్యంలో మండలం లోని కార్యదర్శ ముకుమ్మడిగా సెలవు ప్రకటించాలని కోరారు దీంతో గ్రామంలో పంచాయతీలలో చెత్తను సేకరిస్తున్న హరిత కార్మికులకు డబ్బులు సకాలంలో అందకపోవడంతో అప్పుచేసి వారికి ఇస్తున్నామని అన్నారు. కావున అధికారులు పని భారం తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు శనివారం పంచాయతీ కార్యదర్శులు ముక్కుమ్మడిగా జిల్లా కలెక్టర్ వారికి వినతి పత్రం అందిస్తామని తెలిపారు.

# మంచితనానికి మారుపేరు పంజం





రైల్వే కోడూరు రూరల్, జూన్ 27 ప్రభాతవార్త
అనంతరాజుపేట పంచాయతీ ఎన్నికలలో పట్టు నిలుపుకున్న నాయకుడు. రైల్వే కోడూరు వైసిపి రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పాటు చేసుకుని ఎన్నికలలో చెరగని ముద్ర వేసుకున్న నిలువు టద్దం పంజం అని రాష్ట్ర మాజీ స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రైల్వే కోడూరు వైసిపి సీనియర్ నాయకులు మాజీ జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి (62)శుక్రవారం తెల్లవారుజామున చెన్నై ప్రైవేట్ హాస్పిటల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చెన్నై నుండి కోడూరులోని వైసిపి కార్యాలయం నందు ఆయన పార్థీవ దేహాన్ని కార్యకర్తలకు వైసీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ గెలుపు కోసం ఆయన ప్రత్యేక శైలి కలిగి ఎన్నో మార్లు చక్రం తిప్పిన ఘనత పంజంకే దక్కుతుందని అప్పటి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జిల్లాకే తలమానికంగా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల యూనివర్సిటీని తేవడంలో పంజం సుకుమార్ రెడ్డికి తిరుగులేదని, అదేవిధంగా రాజశేఖర్ రెడ్డి తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత కుటుంబ మిత్రుడిగా ఉంటూ ఆయన 2019 ఎన్నికలలో ఆయన విశేష కృషిచేసి అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుకుమార్ రెడ్డి పై ప్రత్యేక ఆకర్షణీయంగా తనకంటూ వ్యవసాయ సలహా మండల చైర్మన్‌గా పదవినిచ్చి ఆయనను ఎంతో గౌరవించారు. అదే కోణంలో వైసిపి ఎన్నికలలో సుకుమార్ రెడ్డి నిరంతరం సామాన్య కార్యకర్తలా పనిచేసి వైసీపీ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా ఫీజులు కట్టలేని పిల్లలకు ఉచిత విద్యను అందించి తన పాఠశాల డాల్ఫిన్స్ డేల్ లో ఎంతోమందికి విద్యార్థులు నేర్పించి అత్యున్నత శిఖరాలకు చేరే విధంగా విద్యార్థులను యువ కెరటాలుగా తయారు చేసిన ఘనత సుకుమార్ రెడ్డికి దక్కిందన్నారు. ఇటీవల గత ఆరు నెలల క్రిందట అనారోగ్య రిత్యా చెన్నై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు వారు తెలిపారు. కోడూరు వైసిపి రాజకీయాలలో పెద్ద దిగ్గజం నేల కొరిందని నేతలు కన్నీరు మున్నీరుగా విలపించారు.

### శనివారం సెలవు ప్రకటించారు.

రైల్వేకోడూరులో ప్రైవేటు పాఠశాలల మాజీ అధ్యక్షులుగా, గౌరవ అధ్యక్షులుగా పనిచేసిన పంజం సుకుమార్ రెడ్డికి గౌరవిస్తూ రైల్వేకోడూరులోని ప్రైవేట్ పాఠశాలల, కాలేజీల బృందం ఒక్కసారిగా శనివారం సెలవును ప్రకటిస్తూ ఆయన మృతికి రెండు నిమిషాలు మోనం కూడా పాటించారు. అయితే ఆయన మృతికి శ్రద్ధాంజలి ఘటించిన వారిలో సిల్వర్ బిల్స్ అధినేత ఎం వి కుమార్, ఆదర్శ విద్యా నికేతన్ అధినేత కంచిరాజు చంగల్ రాజు, శ్రీ సాయి బాలాజీ అధినేతలు బాబు, ఉప్పలపాటి శ్రీనివాసరాజులు, గౌరీ శంకర్ పాఠశాల అధినేతలు గోపి, శ్రీ షిరిడి సాయి కళాశాల అధినేతలు చంగల్ రాజు, రవి కుమార్ రాజు, రెడ్డయ్యతోపాటు విక్టరీ పాఠశాలల అధినేతలు నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి పాఠశాల హెడ్ మాస్టర్ బాలయ్య,చెంగయ్య సిబ్బంది తొపాటు ప్రముఖ పారిశ్రామికవేత్త తీయవరం వేణు గోపాల్ రెడ్డి, కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, కోడూరు ఉప సర్పంచ్ తోట శివ సాయి, జిల్లా యువజన అధ్యక్షులు యలగచర్ల శివా ప్రసాద్ రెడ్డి, గుత్తి రెడ్డి హరినాథ్ రెడ్డి, ఎంపీటీసీ పందేటి జనార్దన్ రాజు ఆర్యవైశ్య నాయకులు గునిపెట్టి రమేష్ మైనార్టీ నాయకులు వైయస్ అన్వర్ భాష కరిముల్లా మజీద్ సర్పంచులు దార్ల చంద్రశేఖర్, ఆనాల చెంగల్రెడ్డి, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, రామకృష్ణ ఆర్‌వి రమణ యజ్ఞం చంద్రశేఖర్, జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ చంద్ర, కొప్పల శంకరయ్య రమేష్ నాగేంద్ర బూంపల్లి నాగరాజా ఆంజనేయులు, అనంతరాజుపేట షఫీ శెట్టిగుంట షఫీ తదితరులు ఆయన మృతదేహానికి పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు ఆయనకు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

## ప్రతి విద్యార్థి మొక్కను నాటి పచ్చని భవిష్యత్తుకు బాటవేయండి

మదనపల్లెక్రైం, జూన్ 27 ప్రభాతవార్త :



పట్టణంలోని మల్లికార్జున సర్కిల్ వద్ద ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలోని విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చైతన్య విద్యాసంస్థ ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా మొక్కను నాటి పర్యావరణాన్ని పెంపొందింప చేయాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా ఉండాలన్నారు. ఆర్ఐ శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విద్యార్థులకు సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లుగా పెంచితే అవి మన ఆరోగ్యాన్ని కాపాడుతాయన్నారు. మనకే కాకుండా మన భావితరాలకు ఆధారంగా ఉంటాయన్నారు. పర్యావరణ పరిక్షణలో భాగంగా విద్యార్థులు ముందుగా పచ్చదనం ప్రాణదారం, ఊపిరి కోసం ఒక మొక్క అన్న నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమేష్, డీన్ నూర్ మహమ్మద్, సి.బ్యాచ్ ఇన్‌చార్జ్ వెంకటేష్, ప్రైమరీ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పని ఒత్తిడి తగ్గించాలని ఎంపిడిఓకు వినతి



రామసముద్రం జూన్ 27 ప్రభాతవార్త
తమపై పని ఒత్తిడి తగ్గించాలంటూ రామసముద్రం ఎంపీడీవో భాను ప్రసాద్‌కు శుక్రవారం పంచాయితీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థాయిలో వ్యవహారాలను చూసుకుంటూనే, సచివాలయాల సిబ్బంది చేయాల్సిన పనులను కూడా ఒకే సమయంలో పర్యవేక్షణ చేయాల్సి రావడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. సదరు విషయంపై ఈనెల 28న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు పాల్గొన్నారు.

## నార్ల పల్లెలో గొర్రెలకు టీకాలు

కురబలకోట జూన్ 27 ప్రభాతవార్త
అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ఇన్చార్జి దాసరి పల్లి జయచంద్ర రెడ్డి ఆదేశాలతో చింతమాకులపల్లి పంచాయతీ నార్లపల్లి లో గొర్రెలకు పెరుగు మందు టీకా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ మేజరి తిమ్మరాయుడు,మండల నాయకులు కోళ్ల శివా రెడ్డి, సిద్ధళ శివ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు రాజోళ్ళ వెంకటేష్,ఉపాధ్యక్షుడు వనిసె ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముంగాని బాలకృష్ణ రెడ్డి, గ్రామ కమిటీ కార్యదర్శి రాజోళ్ళ చలపతి, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి మెజారి సదాశివ, మెజారి గంగులప్ప,బూత్ కన్వీనర్ కనుగొండ వెంకటరమణ రెడ్డి, జనార్దన్ రెడ్డి,నాగేశ్వర,రమేష్,వెటర్నరీ డాక్టర్ నీరజ మేడం డిప్యూటీ డైరెక్టర్, చింతమాకులపల్లి వెటర్నరీ డాక్టర్ నిర్మల,నందిరెడ్డిగారిపల్లి వెటర్నరీ డాక్టర్ ధరణి నాథ్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వేయర్ల సమస్యలపై నిరసన

కురవలకోట జూన్ 27 ప్రభాతవార్త
విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు హేతుబద్ధీకరణ తర్వాత మిగిలిన గ్రామ సర్వేయర్ల ఉద్యోగుల పరిస్థితి మీద స్పష్టత, పదోన్నతుల మీద స్పష్టత మరియు గ్రామ స్థాయి ఉద్యోగులమైన మాకు సొంత మండలములో పోస్టింగ్ కోరుతూ కురబలకోట మండలంలోని గ్రామ సర్వేయర్లందరూ 27 న తహశీల్దారు ధనంజనేయులు వారికి, MPDO గంగయ్యకి మరియు మండల సర్వేయర్ భువనేశ్వరికి అర్జీ ఇచ్చి శాంతియుత నిరసన తెలియచేశారు. ప్రభుత్వం వారు స్పందించి మా యొక్క వినతి పైన స్పందించి ప్రభుత్వం పెద్దలు మా యొక్క సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నాము.



## పని బారాన్ని తగ్గించండి



సుండుపల్లె, జూన్ 27, ప్రభాతవార్త:
మండల పరిధిలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం విధించే పని భారం తట్టుకోలేక రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు రెండు రోజులు పాటు సామూహిక సెలవులు ఇవ్వాలని శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులపాటు సామూహిక సెలవలు పెట్టి అనంతరం జిల్లా కేంద్రంలో అధికారులకు వినతిపత్రం అందించి నిరసన చేపట్టనున్నట్లు వారు తెలిపారు. చెత్త సేకరణ పై ప్రతిరోజు ఉదయం ఆరు గంటలకే తమ పంచాయతీ పరిధిలో చెత్త సేకరణకు హాజరుకావాలని ప్రభుత్వం సూచనలు ఇచ్చిందని దూర ప్రదేశాల నుండి ప్రతిరోజు ఉదయం ఆరు గంటలకే రావాలంటే కష్టంగా ఉంటుందని అందులో సచివాలయంలో పనిచేసే తోటి ఉద్యోగుల పని భారాన్ని కూడా తమపై మోపుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి



ఎడ్యుకేషన్ జూన్ 27 ప్రభాతవార్త :
అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులను మోసం చేస్తున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం(పిఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనర్ ఒరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఖాజీపేట మండల పరిధిలో ఉన్నటువంటి పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖ ఆదేశాలను ధిక్కరిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని నర్సరీకి అడ్మిషన్ పొందాలంటే బుక్స్ యూనిఫామ్ కు 8000 వేలు, ట్యూషన్ ఫీజు 25000 వేలు, అడ్మిషన్ ఫీజు 10000 రూపాయలు కట్టాలంటూ అక్రమంగా పాఠశాల యాజమాన్యం వసూలు చేస్తున్నారని, 10 వ తరగతికి 2 లక్షల రూపాయలు వరకు వివిధ రకాల ఫీజుల పేరిట వసూలు చేస్తున్నారని, పాఠశాలలో బుక్స్ యూనిఫామ్ అమ్మకూడదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వారి ఆదేశాలను పట్టించుకోకుండా బుక్స్, యూనిఫామ్ అమ్ముతున్నారన్నారు, కేవలం నర్సరీకి అడ్మిషన్ ఫీజు 10000 వేలు రూపాయలు కట్టాలంటున్నారని వారు వాపోయారు,విద్యా హక్కు చట్టం కూడా అమ్ములు కావడం లేదన్నారు, కావున జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థి తల్లిదండ్రులను నిలువునా దోపిడీ గురిచేస్తూ ధనార్జనే ధ్యేయంగా విద్యను వ్యాపారం చేస్తూ కోట్లాది రూపాయలు విద్యా వ్యాపారం చేస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు,

## స్థల వివాదంతో కొండారెడ్డికి, కొనిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదు

### 19వ వార్డు కౌన్సిలర్ మునీర్

ప్రొద్దుటూరు జూన్ 27 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలో గత నాలుగు రోజులుగా ప్రొద్దుటూరు మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ కు తనకు జరుగుతున్న స్థల వివాదంలో కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని 19 వ వార్డు కౌన్సిలర్ మునీర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా తనపై నకిలీ డాక్యుమెంట్లు తయారు చేస్తున్నారని ఆరోపణలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 1982లో మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్ ఫర్నిచర్ షాప్ నిర్మించే క్రమంలో స్థలాన్ని కొలతలు వేసిన తర్వాత రిజిస్టర్ ఆఫీస్ లో డాక్యుమెంట్ ఇచ్చిన శేఖర్ యాదవ్ నేడు తప్పు అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో మేమిద్దరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగే క్రమంలో ఆరోజు శేఖర్ యాదవ్ కు ఒప్పుగా కనపడిందన్నారు. స్వతహాగా శేఖర్ యాదవ్ స్టాంపు రైటర్ కాబట్టి ఎన్ని జిమ్మిక్కులు అయినా చేయగల సమర్థులని ఆయన విమర్శించారు. ఈ వివాదంలో కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి లాగుతూ ఆరోపణలు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థల విభాగంలో వారికి ఎలాంటి సంబంధం లేదని తనకు శేఖర్ యాదవ్ కు మాత్రమే సంబంధం ఉందని తెలిపారు. వారిపై ఆరోపణలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి తీసుకెళ్ళాలి

### వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్




సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్‌అహ్మద్

మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త :
కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి తీసుకెళ్ళాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. శుక్రవారం జిల్లా వైసిపి సమన్వయకర్తలు, కోఆర్డినేటర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇచ్చిన హామీలు విస్మరించి ఐదుకోట్ల మంది ప్రజలకు మోసం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు కోసం వెళ్ళే కూటమి నాయకులను నిలదీయాలన్నారు. బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ పేరుతో చంద్రబాబు మ్యానిఫెస్టును ప్రజలకు గుర్తు చేయాలన్నారు. వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కూటమి పాలనలో మామిడి, టమోటా రైతుల దుస్థితి దయనీయంగా ఉందన్నారు. ధరలు లేక రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారన్నారు. జగన్ 2.0 తో కార్యకర్తలకు పెద్దపీట వేస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు.

## హార్సిలీహిల్స్‌లో భూములను కేటాయిస్తే సహించం

### కాంగ్రెస్, వామపక్ష నాయకులు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త :
రాష్ట్రంలో ఆంధ్రాఊటీగా గుర్తింపు పొంది ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో కార్పోరేట్ సంస్థకు భూములు అప్పగిస్తే సహించేది లేదంటూ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్, సిపిఐ, ఏఐటియుసి, ఆమ్ ఆద్మీ, సిపిఎం, బాస్ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు హార్సిలీహిల్స్‌లో భూములను కట్టపెడితే వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో కలసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వ్యాపార వేత్త రామ్‌దేవ్ బాబా మదనపల్లెకు చేరుకొన్న సందర్భంలో సబ్ కలెక్టర్, డిఎస్‌పి, నియోజకవర్గ అధికారులు స్వాగతం పలకడంపై ఆక్షేపించారు. వైసిపి ప్రభుత్వ హాయాంలో యాత్ర సినిమా డైరెక్టర్‌కు భూ కేటాయింపు చేస్తే వ్యతిరేకించిన కూటమి నాయకులు నేడు పతాంజలి కార్పోరేట్ సంస్థకు భూములు అప్పగించడాన్ని ఎలా సమర్థిస్తారని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హార్సిలీహిల్స్‌లో ఆయుర్వేద యూనివర్శిటిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. యోగాకంటే ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎంతో ముఖ్యమని గుర్తు చేశారు. పేద ప్రజలకు పర్యాటక కేంద్రంగా ఉన్న హార్సిలీహిల్స్‌ను కార్పోరేట్ సంస్థలకు అప్పగిస్తే దూరం చేసినట్లే అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇలాంటి ఆలోచనలను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పిఎల్.నరసింహులు, క్రిష్ణప్ప, మురళి, సాంబశివ, బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు స్కూల్‌లో ఘనంగా హెలెన్ కెల్లర్ డే

మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న దృశ్యం

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం హెలెన్ కెల్లర్‌డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషికి చూపు లేకపోతే నడవలేమని, ఎటువంటి పనులు చేసుకోలేమని, అలాంటిది హెలెన్ కెల్లర్ వినికిడి మాటలు కోల్పోయిన తన ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ఇలాంటి వికలత్వం కలిగిన ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ లీనాకుమారి మాట్లాడుతూ హెల్లన్ కెల్లర్ బాల్యం గురించి ఆమె గొప్పతనం గురించి తెలిపారు. హెల్లన్ కెల్లర్ ఏడాదన్నర సంవత్సరంలో ఉన్నప్పుడు వినికిడి, చూపు కోల్పోయిందన్నారు. ఆమె పుట్టిన సంవత్సరం సందర్భంగా జూన్ 27న హెల్లన్‌కెల్లర్స్‌డే జరుపుకొంటామని తెలిపారు. వికలత్వంతో భాదపడుతున్న హెల్లన్‌కెల్లర్ ఎంతోమందికి స్పూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షున్ని కలిసిన పరిశీలకులు



చినబాబుతో సమావేశమైన పరిశీలకులు

మదనపల్లె, జూన్ 27 ప్రభాతవార్త :
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు శుక్రవారం ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర గౌడ సంఘం ఛైర్మెన్ గురుమూర్తి ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగ్గా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ, సమన్వయం కోసం తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షున్ని కలిసినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా ఏడాదిపాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలోనూ టిడిపి విజయకేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సురేష్‌రాజు, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులునాయుడు, బుదుగు శ్రీనివాసులు, పార్లమెంటు జనరల్ సెక్రటరీ దొరస్వామినాయుడు, తెలుగుయువత నాయకులు అరుణ్ నాదేండ్ల, మహబూబ్‌ఖాన్‌లు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు డీ

రామసముద్రం జూన్ 27 ప్రభాతవార్త



మండలంలోని ఎలావానెల్లూరు గ్రామ పంచాయతీ దాసర్లపల్లి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం దాసర్లపల్లి సమీపంలోని ఘాటి వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బోయ వీధికి చెందిన అశోక్ ఆచారి అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం రామసముద్రం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

